# ★ శూన్యహృదయుడు

అతడటులుండుటకు కారణము ?
బాల్యవివాహమా ?
సంఘదోషమా ?
ప్రేమించి పెండ్లి చేసుకోనందుకా ?
లేక ఆమె దురదృష్టమా ?

శ్రీమతి టి. వి. రత్నవల్లి

ప్రొఫెసర్ కృష్ణారావుగారు తన ఏకైక పుత్రిక కమల ఐదవ తరగతి చదువుచుండగా పదవయేటనే 5 వేలు కట్నమిచ్చి వివాహము గావించెను.

కమల చామనచాయ. ఆమె విశాల నేత్రములు, ప్రేమ విహీనులనుగూడ ఆకర్షింపజేయు ఆ అమాయకపు చూపులు నీటిలోని చేపలవలె మిరుమిట్లు గొల్పుచున్నవి. ఆమె సరళ హృదయురాలు. ఆమె అతి చురుకుగలది గాదు. అతి నెమ్మదియైనదియు, దీర్ఘాలోచన పరురాలూనూ. ఆమె ఎప్పుడును గట్టిగా నవ్వి ఎరుగదు. ఎల్లప్పుడున్నూ ఆమె ముఖపద్మమున చిరునవ్వు చిందులు త్రొక్కుచుండును. అప్పుడే వికసించిన గులాబిపువ్వువలె నుండు ఆమె కోమలహస్తములు వీణ మీటునపుడు ఎంత నలిగిపోయెడివో!

నేటివరకు కృష్ణారావుగారింట్లో చింతకు తావులేదు. కాని, కాలచక్రమెప్పుడూ ఒక్కలాగుం టుందా! అల్లుని సంగతి అతని కెంతమాత్రము నచ్చలేదు. ఆ కఠినాత్మునితో తనపిల్ల ఎటుల కాపురము చేయునా యని విచారము. కాని, కృష్ణారావుగారు కమలను ఎన్నేండ్లు ఇంట నుంచుకొందురూ? ఆఖరుకి కమల మెట్రిక్యులేషన్ ప్యాసైన యేడు 16-వ యేట ఊరివారి బాధవల్లతే నేమి, ఎలాగైతేనేమి, అల్లుడు సెలవులకు ఇంటికి వచ్చియుండునను ఉద్దేశ్యముతో కమలను అత్తవారింటికి పంపివేసెను.

కమల అత్తవారివూరు శుద్ధ పల్లెటూరు. కమల పట్నవాసపుపిల్ల. అందువలన కమలకు ప్రతి విషయముకూడ క్రొత్తగను, వింతగానూ కనుపించెడివి. ఆమె అతి నాజూకుమంతురాలవుటచే ఆమె కందరును మోటుగా కనుపించిరి. వారు కట్టుకొను గుడ్డలు, ధరించు నగలు, చేయుపనులు, ఆడు మాటలు ఆమెకు విచిత్రముగా నుండెడివి.

కమల అత్తవారి ఇల్లంతయు మట్టి ఇల్లే. వారు దానిని రోజు పేడతో అలికి ముగ్గుపెట్టెడివారు. తొమ్మిదిగంట్ల కందరును చద్దిఅన్నము తినెడివారు. వారింట్లో వంట సరిగ్గా పన్నెండుగంటలకి.

కాని, అత్తవారింట్లో ఎన్ని కష్టములున్ననూ, వాటిని సహర్షముగా సహించుటే నెలతుల లక్షణము. అదియే వారి సహజనైపుణ్యము కమల కూడ అట్టివారిలో చేరినదే. చాల ఓర్పుగలది.

రోజులు గడచి పోవుచున్నవి. సగము సెలవులు గడచి పోయినవి. కానీ, కమల భర్త నరసింహుడు సెలవులకి ఇంటికి రాలేదు. అతను స్కూల్ ఫైనలు మూడో సంవత్సరము ప్యాసైనాడు. ఇప్పుడు ఇంటర్ సీనియర్ మూడవయేడు కూడా పోయింది. తర్వాత ఇంటికి వచ్చాడతను.

ఎందుచేతనో తెలియదు కమలకు ఇచ్చటికి వచ్చిన పదునైదు దినములనుండి కొద్దిగా జ్వరము తగులుతూంది. ఆమెకు బెంగయో, తలిదండ్రులువద్ద లేరను విచారమో, వేళకు తిండిలేకనో ఎందువల్లనైతేనేమి దినదినమునకు జ్వరం ఎక్కుతూనే వుంది. జ్వరమువచ్చిన పదునైదు దినములకు మెల్లగా వాళ్లవాళ్లకు ఉత్తరం వ్రాసాడు ఆమె మామగారు.

ఇంకేముంది సర్వస్వము కమలయే కృష్ణారావుగారికి. అందువల్ల మర్నాడే హాజరైనారు కృష్ణారావు దంపతులు. జ్వరము ఇంకా ఎక్కువై డబిల్ నిమోనియాలో దింపింది. జ్వర మెక్కువైన కొద్దీ కృష్ణారావు గారికి ఆవేద నెక్కువైంది. ఇంటివైద్య మాయనకు సరిపడలేదు. తక్షణమే హాస్పిటల్లో చేర్చారు. కృష్ణారావు గారు ఆయన భార్యకూడ కడుపుకు ఆహారము కంటికి నిద్రలేకుండ 24 గంటలు రోగి శుశ్రూష చేయుచుండిరి. కాని, అత్తమామలు ఎటులనుందని కూడా అడిగేవారుకారు. సరి, భర్తనడగనే అక్కర్లేదు. అత్తమామలు వారానికి ఒకసారైన లోకులబాధలు పడలేక వెళ్లేవారు. కాని, భర్త అదీలేదు. ఒక్కసారైనా వెళ్లలేదు. ఉత్తమూఢుడు. ఆహా! ఎంత కఠినాత్ముడు!! ఏమి అతడు అందరివల్లె అగ్నిసాక్షిగ పెళ్లి చేసుకోలేదా!!! అతడు కేవలము కట్నాన్నే పెళ్లిచేసుకున్నాడు. మామగారివద్దనుండి డబ్బులాగుచునేయున్నాడు. అతనికి పాషాణ హృదయము. కాకున్న అట్లుండగలడా! వీధిలోపొయ్యే బిచ్చవానికి కూడ దెబ్బతగిలిన మనస్సు నిలువదు గదా! అటువంటిది తన్నే నమ్ముకొని తన్నే సర్వస్వము ననుకొను భార్యను తన కిష్టములేక పోయినను సరే ఒక్కసారైనను చూడవద్దా! అసలు తనుభార్య వచ్చేక ఆమెతో మాట్లాడే ఎరుగడు. అంత చక్కనిది చదువులకుప్ప సద్గుణవతి వానికెటుల కన్పడెనో దైవమున కెరుక.

అతడటులుండుటకు కారణము?...బాల్యవివాహమా?...సంఘదోషమా?...ప్రేమించి పెండ్లి చేసుకోనందుకా? లేక ఆమె అదృష్టమా? ఎవరికి తెలుసు భగవంతుడే ఎరుగు. కమలలోలోన కృశించు చున్నది భర్తకు తనపై ప్రేమలేదుగదాయని.

మర్నాడు ఆమెస్థితి బొత్తుగా బాగులేదు. నాడి చేతిలో గంటలకొద్ది వెతికిననూ కనుపడలేదు. చూపుకూడ మారింది.

సాయంకాల మారుగంటలైంది. సూర్యుడస్తమించాడు. అప్పుడే కమల కొంచెం కళ్లువిప్పి చూచింది. ప్రక్కన తల్లికూర్చుంది. ఆమె కళ్లువిప్పి నాల్గువైపుల కలియచూచింది. కాని, ఆమె అదృశ్య దృశ్యమును వీక్షిస్తూంది. కొంచెము సేపటికి ఆమె 'అమ్మా...అమ్మా'యని పిలిచింది. 'ఏమమ్మా ఏంకావాలీ, ఎందుకలా చూస్తావు?' అని తల్లి నెమ్మదిగా దగ్గర మంచంమీదకూర్చుంది. కాని, ఆమె చూపుకు అంతు లేకుండావుంది. ఆమెకు రెండుదినములై చూపు మారినప్పటికీ ఆమెచూపు వేటినో తదేకదృష్టితో వీక్షించు చున్నది.

ఆమె తల్లినిచూచి నెమ్మదిగా 'అమ్మా...నాకు పెండ్లి ఎందుకుచేశావమ్మా...నేను సుఖపడతానేమోననా?...వారికి నామీద అంతపగ ఏమమ్మా......అమ్మా! నా కండ్లు మూతలుపడుచున్నప్పటికి... వేటినో వీక్షిస్తున్నాయి' అని నెమ్మదిగా అనెను.

'అవును తల్లీ గ్రహించితిని. ఏమి చేయుదును?...అతడు...శూన్యహృదయుడు'అని తల్లి కన్నీరు కార్చినది....ఆ మాటవినగానే ఆమె తుదినిద్రలో లీనమైపోయింది........